క్లుప్తంగా

తగ్గిపోయిన సరుగుడు ధర



విక్రయానికి లారీపై లోడ్ చేస్తున్న సరుగుడు

మాకవరపాలెం : సరుగుడు ధర భారీ తగ్గడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో రైతులు సరుగుడు సాగు చేస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం వరకు టన్ను ధర రూ.9 వేలు ఉండేదని, ప్రస్తుతం రూ.7 వేలు ఉందన్నారు. ఒక్కసారిగా రూ.2 వేలు తగ్గడంతో సరుగుడు రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరకు సాగు చేసినా గిట్టుబాటు ధర లేకపోవడంతో సరుగుడు సాగు వైపు దృష్టి సారించామని, ఇపుడు దీని ధర కూడా భారీగా తగ్గడంతో వాపోతున్నారు. ఎకరా భూమిలో సరుగుడు సాగు చేసేందుకు రూ. 80వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుందని, ఈ నేపథ్యంలో ధర తగ్గుముఖం పట్టడంతో నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

13, 14 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు



విద్యార్థులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం : ఈ నెల 13,14 తేదీల్లో యలమంచిలిలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని డివిజన్ నాయకులు గౌతమ్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాడుతుందన్నారు. మహాసభల్లో భవిష్యత్తు కార్యచరణ రూపొందించి విద్యార్థుల సమస్యలపై పోరాటం సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ జనార్దన్, వైస్ ప్రెసిడెంట్ భూషణరావు, డివిజన్ సభ్యుడు భార్గవ్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మాకవరపాలెం : సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. ఆయన మాకవరపాలెంలో బుధవారం మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే ఉపాధ్యాయులందరికీ ఒకే విధమైన సర్వీస్ రూల్స్ ఉండాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో లేవనెత్తుతున్నామన్నారు. ఆయన వెంట ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీరామ్మూర్తి ఉన్నారు.

13న కలెక్టరేట్ వద్ద రైతు ధర్నా

చీడికాడ : ఈ నెల 13వ తేదీన అనకాపల్లి కలక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై నిర్వహించనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులను విద్యుత్‌చార్జీల పెంపుతో నట్టేట ముంచాడన్నారు. ఈ సమస్యలపై పార్టీ పిలుపు మేరకు అనకాపల్లిలో ఈ నెల 13న నిర్వహించే ధర్నాలో పార్టీ నేతలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర పార్టీ కేడర్ ఆరోజు ఉదయం 9 గంటలకు రైల్వేస్టేషన్ రోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు తరలిరావాలని కోరారు.

నామస్థూప నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ధర్మకర్త సీతారామశర్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టరు సూర్యచంద్ర

నాతవరం : చిక్కుడుపాలెం గ్రామంలో గల శ్రీశివ శక్తి క్షేత్రం శివాలయంలో ద్వారబంధం ఎదురుగా శివ పంచాక్షరి నామ స్థూప నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసినట్టు ఆలయ ధర్మకర్త సీతారామశర్మ తెలిపారు. ఎక్కడా లేని విధంగా ఈ పుణ్యక్షేత్రం ప్రాంగణంలో 63 దేవాలయాలు, 120 ఉపాలయాలు, 150పైగా దేవతామూర్తులతో విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంగణంలో సహకారంతో శివాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

అవస్థలు అపారం



ఆంధ్రాబ్యాంకులోని ఆధార్ కేంద్రంలో విద్యార్థుల నుంచి బయోమెట్రిక్ నమోదు చేయిస్తున్న సిబ్బంది

- ఆధార్ సరిపోలని విద్యార్థులకు తప్పని తిప్పలు
- తప్పొప్పుల సవరణకు ఆధార్ కేంద్రాల వద్ద నిరీక్షణ

నియోజకవర్గంలో మండలాల వారీగా పాఠశాలల సంఖ్య-విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	మొత్తం విద్యార్థులు	అపార్ జనరేట్ కాని విద్యార్థులు
నర్సీపట్నం	119	25509	1407
మాకవరపాలెం	53	5134	840
గొలుగొండ	61	4207	218
నాతవరం	59	5195	925

నర్సీపట్నం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమెటిక్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు కార్డుల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తున్నారు. పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల వివరాలు ఆధార్‌తో సరిపోలకపోవడంతో కార్డుల జారీలో జాప్యం నెలకొంది. ఆధార్‌కార్డులతో పాఠశాల రికార్డు షీట్‌తో పోల్చినపుడు విద్యార్థుల వివరాల్లో తప్పులు బహిర్గతమయ్యాయి. పాఠశాల ప్రవేశం దగ్గర నుంచే విద్యాశాఖ యాప్‌లో ఆధార్ నంబరును అనుసంధానం చేసినప్పటికీ ఇప్పటివరకు తప్పులను ఎవరూ పట్టించుకోలేదు.

పుట్టిన పిల్లల దగ్గర నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల వరకు ఆధార్ ప్రమాణికంగా మారింది. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ నుంచి పిల్లలు పుట్టిన వివరాలను మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు పంపిస్తారు. అక్కడ నమోదైన తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాక జనన ధ్రువీకరణ పత్రం తీసుకుంటారు.



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థుల నిరీక్షణ

సదరు ధ్రువీకరణ పత్రాలను పాఠశాల ప్రవేశ సమయంలో విద్యార్థుల నుంచి తీసుకుంటున్నారు. పుట్టిన తేదీ పాఠశాల రికార్డులో నమోదై ఉంటుంది. కొందరు తల్లిదండ్రులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో అప్పట్లో ఆధార్‌కార్డు కేంద్రాల నిర్వాహకులు పెట్టిన తేదీలో తప్పులు నమోదు చేశారు. దీంతో ఎక్కువ మందికి నెల, తేదీలు, పేర్లలో అక్షరాలు తప్పు పడ్డాయి.

సర్వర్ సమస్యలు

ప్రభుత్వం తీసుకొచ్చిన అపార్ కార్డుల జారీతో ఆధార్‌కార్డులో నమోదైన తప్పులను సరిచేయాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులను వెంట పెట్టుకుని ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. సర్వర్ సమస్యతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు రావడంతో పగలంతా కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. దీంతో విద్యార్థులు తరగతులు కోల్పోవడమే కాకుండా తల్లిదండ్రులు పనులు మానుకోవాల్సి వస్తోంది. విద్యార్థుల వివరాలను పూర్తి చేయాలి, లేకుంటే ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వారు విద్యార్థులు వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

గిరిజనుల స్వయం ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్ : గిరిజనుల స్వయం ఉపాధి స్వావలంబనకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. జాలంపల్లి శివారు కామకూటం గ్రామంలో గీతం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో గిరిజనులకు స్వయం ఉపాధి కోసం శిక్షణ అందించే భవన నిర్మాణ పనులకు ఆయన బుధవారం భూమి పూజ చేశారు. గీతం ప్రాజెక్టు ఇంచార్జి ఇంజేటి సౌమ్య అధ్యక్షతన గిరిజన గ్రామాలైన గొప్పులపాలెం, లోవకొత్తపల్లి, లోవ కృష్ణాపురం, కాటమకూటం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతు స్థానికంగా లభ్యమయ్యే అరటిచెట్లు, అరటిబోదెలు నుంచి నారతియ్యడం, తీసిన నారతో ప్రజలకు ఉపయోగపడే వస్తువుల తయారీ మీద శిక్షణ ఇస్తామన్నారు. ఎంపీడీవో అప్పారావు, గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పవన్ కళ్యాణ్, ఆరోహన్ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ సమన్వయకర్త అప్పారావు, సొసైటీకి చెందిన సరేష్ పట్నాయక్, జి.అశ్విన్, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం : క్రికెట్ టోర్నమెంట్‌ను వినియోగించుకుని ప్రతిభను చాటాలని నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు అన్నారు. నర్సీపట్నం పట్టణ కేంద్రంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం, రత్న టాటా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఉపకరిస్తాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నీని ఏర్పాటు చేసిన అకంరెడ్డి సురేష్‌ని అభినందించారు. నెల రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నమెంట్ ప్రశాంతంగా జరిగేందుకు క్రీడాకారులు నిర్వాహకులకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. టోర్నమెంట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ టోర్నమెంట్‌లో 8 టీమ్‌లు పాల్గొంటున్నాయని ఆర్గనైజర్ సురేష్ తెలిపారు. గెలుపొందిన ఫస్ట్, సెకెండ్ టీమ్‌లకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. అనంతరం సీఐ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధనిమరెడ్డి మధు, టిడిపి నాయకులు లాలం మురళీ, పెదిరెడ్ల చింతు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం నిర్మాణ పనుల్లో అవినీతిపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న ఎంపీడీవో మేరిరోజ

గొలుగొండ : పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మిదేవిపేట గ్రామంలో నిర్మాణం చేసిన కమ్యూనిటీ హాలు నిర్మాణంలో అవినీతి జరిగిందని పంచాయతీలో కొంతమంది ఫిర్యాదులు చేయడంతో బుధవారం ఎంపీడీవో మేరీ రోజ్ పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ నిర్వహించారు. భవన నిర్మాణానికి సంబంధించి సుమారుగా రూ.4 లక్షల మేర అవినీతి జరిగిందని గ్రామస్తులు సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మిపై ఫిర్యాదులు చేశారు. గ్రామస్తులంతా కలసి సొంత నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేస్తే సర్పంచ్ ఈ కమ్యూనిటీ భవనంపై ఎంబుక్ చేయించి నిధులు మార్చుకోవడం జరిగిందని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో విచారణ జరపడంతో పాటు సదరు కమ్యూనిటీ భవనం పనులు పరిశీలించారు. విచారణ నివేదిక జిల్లా అధికారులకు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, సర్పంచ్ విజయలక్ష్మి, వార్డు సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలపై ఇంటింటి ప్రచారం



సీతబందలులో ప్రచారం జరుపుతున్న సీపీఎం నాయకులు నరసింహమూర్తి తదితరులు

మాడుగుల : ఈ నెల 20 నుంచి నర్సీపట్నంలో జరగనున్న సీపీఎం 24 వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలంటూ సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి ఆధ్వర్యంలో అవురువాడ పంచాయతీలో గిరి గ్రామాలైన చిన గొరిగెడ్డ, సీతబందల గ్రామాల్లో ఇంటింటికి విరాళాలు సేకరిస్తూ ప్రచారం నిర్వహించారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5 వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, పోడు భూములు పట్టాలు గురించి ఈ సభల్లో చర్చించడం జరుగుతుందన్నారు.

68 మందికి ఉచిత వైద్య సేవలు

మాడుగుల రూరల్: కె.జె.పురం సచివాలయంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో బుధవారం 68 మందికి వైద్య సేవలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. లీలాప్రసాదు రోగులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీహెచ్ఓ సుజాత, పిహెచ్ఎన్ ఇందిర, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగు రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్



తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి : మండలంలోని ఖాళీగా ఉన్న నాలుగు రేషన్ డిపోలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేవరాపల్లి-2(ఈడబ్ల్యుఎస్-మహిళ), నాగయ్య పేట (ఓసీ-మహిళ), కాశీపురం-ఓసి, కలిగొట్ల ఎస్సీ కేటగిరిలకు కేటాయించినట్టు తెలిపారు. ఆయా గ్రామాల్లో కేటాయించిన కేటగిరిలకు సంబంధించి స్థానిక అభ్యర్థులు ఈ నెల13 లోగా అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 26న రాత పరీక్ష, 27న ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని ఆమె స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు ధర్మశ్రీ పరామర్శ



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న ధర్మశ్రీ

నర్సీపట్నం : హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో రోబోటిక్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ బుధవారం పరామర్శించారు. ధర్మశ్రీని పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అల్పపీడనంతో ఆందోళన

కె.కోటపాడు/మాడుగుల రూరల్ /బుచ్చెయ్యపేట : అల్పపీడనం కారణంగా వర్షాలు పడే పరిస్థితులు ఉండనున్నట్లు అధికారుల ప్రకటనల నేపథ్యంలో కోత దశకు చేరిన వరిపంట సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వారం రోజులుగా వరిపంట కోతలను పూర్తి చేసి మడుల్లోనే పంటను ఎండబెట్టారు. ఈ నేపథ్యంలో మళ్లీ బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో వర్షాలు పడనున్నాయన్న హెచ్చరికతలతో మళ్లీ అలజడి నెలకొంది. వరి కోతలు వాయిదా వేసుకోవాలని, కోసిన పంటను కుప్పలుగా వేసుకుని టార్పాలిన్లు కప్పి సంరక్షించుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

నర్సీపట్నం : పంటల బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ టి.శ్రీదేవి పేర్కొన్నారు. సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, పెసలు, మినప పంటలకు బీమా నమోదు చేసుకోవాలన్నారు. వరి పంటకు ఎకరానికి రూ.630, పెసర, మినుము పంటలకు రూ.300 ప్రీమియం చెల్లించాలన్నారు. మీసేవ కేంద్రాలు, పీఎంఎఫ్‌బీవై మొబైల్ యాప్‌లో రైతులు నమోదు చేసుకోవచ్చన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఎస్ఎల్ బ్యాడ్మింటన్ అకాడమి వారు రెండు రోజుల పాటు బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలలు, కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు అకాడమి నిర్వాహకులు వి.ఎస్.లక్ష్మి, శివరామకృష్ణరాజు, డాక్టర్ రాయపురెడ్డి శ్రీనువాసరావు బహుమతులు అందజేశారు.

బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సీడీపీవో మేరీ సువార్త



నాతవరంలో కిశోరి వికాసం పోస్టరు విడుదల చేస్తున్న అధికారులు

నర్సీపట్నం : ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు బాటలు వేయాలని నర్సీపట్నం ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమంలో ఎంతో దోహదపడుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో బుధవారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పునాది వేయాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం కిశోరి వికాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆడపిల్లలను ఉన్నత విద్యావంతులు తీర్చిదిద్ది, వారి మనోవికాసానికి తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తలుపులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ : బాల్య వివాహాలను అడ్డుకునే బాధ్యత మన అందరిపై ఉందని గెస్టు లెక్చరర్, రిటైర్డు ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి అన్నారు. వీబీపేటలో బుధవారం కిశోరి వికాసం పేరిట నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడ బాల్య వివాహాలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వాటి వల్ల జరిగే నష్టాలను తల్లిదండ్రులకు వివరించి వాటిని నిరోధించే బాధ్యత ముఖ్యంగా అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులపై ఉందన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందరరావు, ఎంఈఓ జోంజుబాబు, సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి, మాడుగుల ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ చిన్నమ్మలు పాల్గొన్నారు.

నాతవరం : బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఐసీడీఎస్ గొలుగొండ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి అన్నారు. మండల కేంద్రంలో గల కల్యాణ మండపంలో కిశోరి వికాసంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల్లో సచివాలయాల వారీగా ప్రభుత్వం కొత్తగా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ సభ్యులు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం, బాల్య వివాహాలు నిర్మూలించడంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న, ఎంఈవో సత్యనారాయణ, వెలుగు ఏపీఎం కనకరాజు, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికకు సర్వం సిద్ధం



మాడుగులలో నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న జేఈ భార్గవ్, వీఆర్‌ఓలు

నర్సీపట్నం : ఇరిగేషన్‌శాఖ పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని నర్సీపట్నం ఉప కార్య నిర్వాహక ఇంజనీరు వి.బాలసూర్యం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేశామన్నారు. ఈ నెల 14న సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలకు జరగనున్నాయన్నారు. మైనర్ ప్రాజెక్టులు 256 ఉన్నాయన్నారు. పెద్దేరు, కోనాం, రైవాడ మీడియం ప్రాజెక్టుల కిందికి వస్తాయన్నారు. వీటి పరిధిలో 28 నీటిసంఘాలు ఉన్నాయన్నారు. తాండవ మేజర్ ప్రాజెక్టు కిందికి వస్తుందన్నారు. తాండవ ప్రాజెక్టు పరిధిలో 27 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. నామినేషన్ వేసే వ్యక్తి నీటి బకాయి ఉంటే తిరస్కరిస్తామన్నారు. ఒకరే నామినేషన్ వేస్తే ఏకగ్రీవంగా ప్రకటిస్తామన్నారు. ప్రతి సాగునీటి సంఘంలో ఆరుగురు సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవాలన్నారు. సభ్యులను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకోవచ్చు, లేకుంటే చేతు లెత్తే పద్ధతి కానీ సీక్రెట్ ఓటింగ్ ద్వారా ఎన్నుకోవచ్చన్నారు. గతంలో సీక్రెట్ ఓటింగ్‌కు అవకావశం లేదని, ఈసారి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. వీరి పదవీ కాలం ఐదేళ్లు ఉంటుందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రైతులు సహకరించాలన్నారు.

నోటిఫికేషన్ జారీ

మాడుగుల రూరల్/మాడుగుల : నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ బుధవారం విడుదల చేశారు. మండలంలో 8 మధ్య తరహా, 14 చిన్నతరహా నీటి సంఘాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. మాడుగుల ప్రభుత్వ కార్యాలయాల వద్ద మండల ఇరిగేషన్ జేఈ భార్గవ్ కుమార్, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో విడుదల చేశారు. ఈ నెల 14 వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు ఎన్నికలు పూర్తి చేయాలని, సంఘాల డైరెక్టర్లు, అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఎన్నిక నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు.

మేడివాడలో శ్మశాన వాటికపై వివాదం

చోడవరం : మృతి చెందిన మహిళ భౌతికకాయాన్ని ఖననం చేసే స్థలంపై రావికమతం మండలం మేడివాడలో రెండు మతాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇది కాస్తా తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడంతో చివరికి పోలీసులు రంగం ప్రవేశం చేశారు. వివరాల్లోకి వెళితే...మేడివాడ గ్రామానికి చెందిన తానియత్ లక్ష్మి(70) అనే మహిళ బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఈమె మృతదేహాన్ని ఖననం చేసేందుకు గ్రామ సమీపంలో ఉన్న తమ శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. ఒక పక్క జగనన్న కాలనీ రావడం, మరో పక్క గ్రామం విస్తరిస్తుండడంతో ఈ శ్మశాన వాటిక గ్రామం మధ్యలో ఉందని, మృతదేహాలను ఖననం చేయడం మంచిది కాదని, గ్రామం చివరకు శ్మశానవాటికను మార్చాలంటూ స్థానికులు కొందరు అడ్డుకున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీ పాలకవర్గం కూడా మృతురాలి మత పెద్దలకు చెప్పింది. వారి మతస్తులకు 10 సెంట్ల స్థలం శ్మశానవాటికకు కేటాయిస్తామని, అక్కడే మృతదేహాన్ని ఖననం చేయాలని పంచాయతీ సర్పంచ్ నరసింహమూర్తి చెప్పారు. అయితే దానికి వారు నిరాకరించారు. దీంతో వివాదం పెరిగి ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. వెంటనే తహసీల్దార్ వెంకటరమణ, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తమ సిబ్బందితో మేడివాడ వచ్చారు. ఇరుమతాల పెద్దలను పిలిచి మాట్లాడారు. మత సామరస్యం పాటించాలని, ఎటువంటి ఉద్రిక్తతకు పాల్పడవద్దని కోరారు. ప్రస్తుతానికి తానియత్ లక్ష్మి మృతదేహాన్ని గ్రామంలోని శ్మశాన వాటికలోనే ఖననం చేసేందుకు ఇరువర్గాలు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది.

‘23 నెలలుగా జీతం చెల్లించడం లేదు’

చీడికాడ : తనకు 23 నెలలుగా జీతం పెట్టకుండా సర్పంచ్ భర్త శ్రీరామమూర్తి, పంచాయతీ కార్యదర్శి వేధిస్తున్నట్టు మంచాల పంచాయతీ గ్రీన్‌గార్డు మామిడి చెల్లయ్యమ్మ ఆరోపించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను 8 ఏళ్లుగా పంచాయతీలో గ్రీన్ గార్డుగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. తన భర్త మృతి చెందడంతో కుమార్తెను చూసుకుంటూ ఈ పని చేస్తున్నానన్నారు. అయితే గడిచిన 23 నెలలుగా తాను ప్రతినెలా రావాల్సిన జీతం పెట్టాలని కోరినప్పుడల్లా చులకనగా మాట్లాడుతూ వేధిస్తున్నారని, తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ రామకృష్ణతో పాటు పంచాయతీ పాలకవర్గం చెప్పినా వారు పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెల్లయ్యమ్మ తెలిపారు. కాగా పొట్టగడవక గ్రీన్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్న చెల్లయమ్మకు జీతం పెట్టకుండా వేధించడం తగదని మండల సీఐటీయు కార్యదర్శి ఆర్.దేముడునాయుడు అన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వనితను వివరణ కోరగా గ్రీన్‌గార్డు చెల్లయ్యమ్మ జీతం పెట్టమని తనను కోరిందని, అయితే సర్పంచ్ చెపితే చేస్తానని చెప్పినట్టు తెలిపారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



విద్యార్థుల అభ్యాసాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

రోలుగుంట : మండలంలో పలు పాఠశాలలను యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు బుధవారం సందర్శించారు. రత్నంపేట, బీబీపట్నం పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యార్థుల నోట్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించి కొంత వెనుకబడి ఉన్నట్టు గుర్తించారు. ఉపాధ్యాయులపై ఇదేం విద్యాబోధన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

నాతవరం/రోలుగుట/ మాకవరపాలెం/కె.కోటపాడు : పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులు చక్కటి అవకాశమని నాతవరం తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. మండలంలో శృంగవరం గాంధీనగరం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అలాగే రోలుగుంట మండలం శరభవరంలో, మాకవరపాలెం మండలం అప్పన్నదొరపాలెంలో , కె.కోటపాడు మండలం కె.సంతపాలెం, అర్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి.